# మెరిసేదంతా

పడక కుర్చీలో వెనక్కివాలి పేపరు చదువుతున్న మోహనరావు విసుగ్గా పేపరు కింద పారేసి కళ్ళు మూసుకున్నాడు. "ఎక్కడ ఏడుస్తున్నావే, హైమా? కాస్త సాయం చెయ్యరాదూ వచ్చి?" వంటింట్లోంచి కరుగ్గా మొరటుగా అరుస్తున్న భార్యగొంతు విని అతడి కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఏవేవో దంపుతున్న చప్పుళ్లూ, పోపుల వాసనా ఇల్లంతా అదొక రకమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. మోహనరావు వెనక వైపున్న టేబిల్ మీద నుండి సన్నటి సంగీతాన్ని ఆలపిస్తూంది ట్రాన్సిస్టరు. అతడి పక్కన ఉన్న బెంచీ మీద ఒక గ్రీటింగు తెరచి పెట్టిఉంది. అందమైన ప్రకృతి దృశ్యానికి పొందికైన పదాలు జతపడిన ఆ గ్రీటింగ్ పంపింది రత్నకుమారి. ముత్యాలవంటి ముద్దు లొలికే అక్షరాలతో ఆమె పేరు ఉంది అందులో. 'అప్పుడే నలభై ఏళ్ల వాణ్ణయ్యానా?' లేచి అద్దం ముందుకు వస్తూ అనుకున్న మోహనరావు పెదవుల మీద చిరునవ్వు అలముకుంది. నమ్మలేనట్టు చూసింది అద్దంలోని ప్రతిబింబం, చురుకుతగ్గని చూపులు, మెరుపు మాయనిమేనిఛాయ, అణగని ఒత్తైన నల్లని నొక్కు నొక్కుల క్రాపింగూ.. "పెళ్ళికాని కుర్రాడిలా ఉన్నా 'వంది ఎద.' రత్నకుమారికి ఆ జుట్టంటే మహమోజు. 'నీ నొక్కులజుట్టు చూస్తుంటే నాకు భలే అసూయగా ఉంటుంది. మోహన్!" అని ఆమె మాటలు విన్నప్పుడు ఆకాశం అంత ఎత్తున ఉప్పొంగేది అతడి హృదయం. వలచిన వనిత నోరారా అందాన్ని పొగిడితే ఉబ్బితబ్బిబ్బవని ప్రేమికుడెవరు?

ఫోన్ గణగణ మోగింది, అందుకున్నాడు మోహనరావు. "హలో! నేనూ... రత్నకుమారిని!" అతడి ముఖం ప్రఫుల్లమయింది "గ్రీటింగ్ అందిందా? నేనే స్వయంగా విషెస్ చెబుదామని పిలిచా! విష్ యు ఎ హాపీ బర్త్ డే!" రత్నకుమారి గొంతు తియ్యగా నాజూగ్గా పలికింది. "ఆ. ఆ. థ్యాంక్యూ వెరీమచ్..." "ఏం అంత నీరసంగా ఉంది గొంతు? ఇంకా విందు భోజనం కాలా?" ఫోన్‌లో కిలకిలా రావాలు! "ఊహూ! మా ఆవిడ పిండివంటలు పూర్తయినట్లు లేదింకా..." మోహనరావు నవ్వు రాకపోయినా నవ్వుతూ చెప్పాడు. "అచ్ఛా! విష్ యు ఆల్ ది బెస్ట్! గుడ్‌బై."

తీగలాసాగే గొంతులో అదొక విధమైన లాలిత్యాన్ని ఒలికిస్తూ ఫోన్ పెట్టేసింది రత్నకుమారి. చప్పగా చల్లారిపోయిన ఉత్సాహంతో తిరిగి కుర్చీలో వాలి కళ్లు మూసుకున్నాడు రావు 'వంట మనిషిని పెడతానంటే వద్దని మొండికేసి పన్నెండింటి వరకు ఆ చాకిరీ చెయ్యడం తెలుసుకానీ పొద్దున్నే చక్కగా విషెస్ చెప్పడం రాదుగా సుందరికి?' తలుపు కిర్రుమంది. అడుగుల సవ్వడి లోపలికి వస్తూండడంతో కళ్లు మరీ గట్టిగా మూసుకున్నాడు మోహనరావు. 'అరే! అప్పుడే నిద్దరోతున్నట్టుందే ఈయన?' స్వగతంలో అనుకుంటూ చప్పుడు కాకుండా వెనుదిరిగింది. ఓరగా చూశాడతను. కొంచెం పొట్టిగా, కాస్త లావుగా, చామనచాయతో ఉన్నదామె. 'సుందరిట! పేరు గొప్ప ఊరు దిబ్బ!' కోపంగా అనుకున్నాడు. నడుస్తూంటే ఆవిడ కాళ్లకున్న మట్టెలు నేలకు తగిలి చిన్నగా ధ్వనిస్తున్నాయి. చేతికి వున్న రంగు రంగుల గాజులు గలగల లాడుతున్నాయి. అప్పుడప్పుడు ముక్కున ఉన్న రవ్వలబేసరి తళుక్కున మెరుస్తూంది. 'పల్లెటూరి మొహం!' కసిగా అనిపించిందతడికి. 'తనింకా చిన్నవాడిలా ఉన్నాడు ఆవిడ ముందర! సుందరికప్పుడే అక్కడక్కడ జుట్టు నెరిసిపోతూంది కూడా. ఎవరితోనన్నా తన భార్య అని చెప్పుకోవాలంటే సిగ్గు చేటు! ఈవిడ వెనకాతల వారసులు వాళ్లు అయిదుగురు. పైగా "పెద్దమ్మాయికి పెళ్లి ఈడు వచ్చేస్తూందండోయ్!" అంటుంది సాగదీస్తూ ఇక రెండేళ్లకల్లా తన్ని తాతను చేసెయ్యాలని కామోసు.

మళ్లీ రత్నకుమారి జ్ఞాపకం వచ్చిందతనికి 'ఎంత అందంగా ఉండేదా అమ్మాయి! మిస్ కాలేజి అనే వారంతా. పసిమిచాయలో సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా బంగారు తీగలా మెరిసిపోయేది, చక్రాలవంటి కళ్లూ, పొడుగాటి జడా. అందాన్నంతా పుణికి పుచ్చుకున్న ఆ అమ్మాయిని ఎంతగా ఆరాధించాడు తను!' తన చూపుకోసం తపించే ఎందరినో నిర్దయగా తిరస్కరించిన రత్నకుమారి మోహనరావుతో స్నేహం కలిపింది. అతడి వెంట సినిమాలు – షికార్లు ఒకటేమిటి? ఎన్నో జరిగాయి. 'నీకా స్కై బ్లూ టెరిలీన్ శ్లాక్ ఎంత బాగా వప్పిందో తెలుసా?' అని ఆమె మెచ్చుకుంటే రోజూ అదే వేసుకోవాలన్నంత సంతోషపడేవాడు. "ఏమిటో దొరగారీవేళ మరీ ముస్తాబు చేశారే? దిష్టి తగిలేను!" అంటూ రత్నకుమారి నవ్వినరోజు పొంగిపోయి స్నేహితుల్ని పిక్చరుకు తీసుకు వెళ్లి రోజూ గుర్తుంది మోహనరావుకు. కానీ తీరా ఆ రోజు తల్లి తండ్రులు అతడి పెళ్లి చెయ్యాలని తొందర పడుతున్న సమయంలో ఒకరోజున బీచిలో ఒక సంఘటన జరిగింది.

తలంటి పోసుకుని వదులుగా అల్లుకున్న జడలు రెండూ గాలికి ఎగిరి పడుతూంటే కళ్లమీద పడుతున్న జుట్టు సరిచేసుకుంటూ గుండ్రటి కళ్లు తిప్పుతూ గలగలా కబుర్లు చెబుతున్న రత్నకుమారిని తమ పెళ్లి విషయం అడిగాడతను, రత్నకుమారి అర్థం కానట్టు ఆశ్చర్యంగా చూసింది. "మనకా? పెళ్లా?" అంటూ నవ్వింది. "ఏం, అసలు పెళ్లే చేసుకోకుండా బ్రహ్మచారిణిగా ఉండిపోతావా ఏమిటి?" "ఆ కబుర్లు వదిలెయ్యి, రావ్! పెళ్లి అనే బందిఖానాలో ఇప్పుడప్పుడే పడాలని లేదు నాకు. జీవితాన్ని అనుభవించే తత్త్వం నాది. బుద్ధిగా ఇంకో అమ్మాయిని పెళ్లాడేద్దూ!" చేతి కంటుకున్న ఇసక తేలిగ్గా దులిపేసుకుంది రత్తకుమారి. ఆ విరక్తిలోనే తన పెళ్లి, విషయం పూర్తిగా తండ్రి ఇష్టానికి వదిలివేశాడు రావు. ఆయనకు నచ్చిన మస్తుగా కట్నం తెచ్చిన వధువు సుందరి – పిల్లను కళ్లెత్తి చూడకుండానే పుస్తెకట్టేశాడు మోహనరావు.

"భోజనానికి లేవండి!" భర్తను తట్టిలేపింది సుందరి. ఆవిడి చేతివైపు చూశాడతను, మొద్దుగా బండగా ఉన్న వేళ్లు, బిరుసెక్కిన అరిచేతులు అతడికి ఏవగింపు కలిగింది. పిల్లల కాన్పులతో జుట్టు రాలిపోయింది సుందరికి. ఆరోజు సవరం కూడా పెట్టుకోకుండా చిన్నముడి వేసుకుందామె. ముఖాన అస్తవ్యస్తంగా చెమటకు కరిగిన కుంకుమబొట్టు." "అలా చూస్తున్నారేమిటి? రండి. లేచి, నిర్లిప్తంగా లోపలికి వచ్చి పీటమీద కూర్చున్నాడు. ఒక మూల చీపురు, మరోవైపు మంచినీళ్ల బిందెలు, గిన్నెలు కూరగాయల బుట్టలు వీటన్నిటి మధ్య ఆరు మందికి వడ్డన జరుగుతూంది. 'రత్నకుమారి ఈ ఇంటిలో ఉన్నట్టయితే డైనింగ్ హాలు, టేబుల్ మీల్స్.. ఎంత కొత్తగా ఉంచేది!' అనుకోకుండా ఉండలేకపోయాడు మోహనరావు. "కాస్త బూరిముక్క వెయ్యనా? పోని పులిహోర?" కొసిరింది సుందరి. భార్యను చూస్తూన్న ప్రతి క్షణం రత్నకుమారి జ్ఞాపకం వస్తూనే వుందతడికి ఆ రోజు ఎందుచేతో! నాజూకు లేదేం మాటల్లో బూరిముక్కా, బొబ్బట్టూ, పులిహోరా... పాత వాసన కొడుతూ! "డోంట్ యు వాంట్ సమ్ మోర్ వెజిటబుల్ బాత్, డియర్?" అని తియ్యగా, ఫ్యాషనబుల్‌గా అడిగే... పరధ్యానంగా చెయ్యి కడిగేసుకుంటున్న భర్తను చూసి విస్తుపోయింది సుందరి. చికాగ్గా గదిలోకి వచ్చి తలుపువేసుకుని మంచంమీద వాలాడు మోహనరావు. 'ఛ! క్షణిక విరక్తిలో జీవితంలో ఆనందాన్ని, అందాన్నీ పోగొట్టుకున్నాను' ఇలా అనుకుంటుంటే అతడి మనసంతా భార్యమీద వెగటుతో సంసారం మీద వ్యతిరిక్తతతో నిండిపోయింది.

"ఫర్ మై సేక్... ప్లీజ్ డోంట్ రెఫ్యూజ్!" మూర్తి ప్రాధేయపూర్వకంగా అన్నాడు. "అబ్బ! నీ పట్టు నీదే! వద్దంటే వినవుగా.."

"ఓన్లీ వన్ స్పూన్..." రత్నకుమారి ముచ్చటగా విసుక్కుని నోరు తెరిచింది. స్పూన్‌తో ఐస్‌క్రీం ఆమెనోటి కందించాడు మూర్తి. "యు ఆర్ ఎ గుడ్ గర్ల్!" మూర్తి ఆమె భుజంమీద చెయ్యివేసి మృదువుగా నొక్కాడు. "హలో! మోహన్! గుడీవినింగ్. ఏమిటిలా వచ్చావు?" ఆశ్చర్యంగా వాళ్ల దగ్గిరికి వస్తున్న మోహనరావును పలకరించింది రత్నకుమారి. "గుడీవినింగ్! ఈయనెవరూ?" ప్రశ్నార్థకంగా ముఖంపెట్టి ఆగిపోయాడు రావు. "నీలాగే ఒక స్నేహితుడు. అఫ్ కోర్స్! నీ అంత పిరికివాడు కాదులే!" రత్నకుమారి సొగసుగా నవ్వింది. అలా నవ్వుతున్నప్పుడు ఆవిడ మెడలో ఉన్న ఒంటిపేట మంచి ముత్యాలమాలతో పోటీ పడుతున్న పలువరస చూస్తూ ముగ్ధుడయ్యాడు మోహనరావు. 'ఏవిటలా మింగేసేలా చూస్తున్నావు? మీ ఆవిణ్ణి తీసుకురాలేకపోయావా?" షోగ్గా కనుబొమ్మలెగరేస్తూ, ప్రశ్నించింది. ఆమె మాటల్లో వ్యంగ్యం చురుక్కున తగిలి, సుందరి మెళ్లోని ఆరుపేటల జీగినీ గొలుసు. గుర్తుకు వచ్చి ముళ్లు గుచ్చుకున్నట్టు బాధపడి ముఖం చిట్లించాడు మోహనరావు. లిప్‌స్టిక్ పూతతో మెరుస్తున్న ఆమె పెదవులు నుదుటిమీద తిలకం రంగుతో పోటీ పడుతున్నాయి. రోజా రంగులో ఉన్న మృదువైన బుగ్గలు గులాబి రేకుల్లా ఉన్నాయి. ఒక చేతికి బంగారు గాజూ, మరో చేతికి వాచీ, మెళ్లో ఒకే ఒక ముత్యాల హారం. పైకి అందంగా అమర్చిన జుట్టుముడి, స్లీవ్‌లెస్ చోళీ, నైలాన్ చీరలో అప్పరసలా, అధునాతనంగా ఉన్న రత్నకుమారి వయసును జయించిన అమరకన్యలా ఉంది. ఆవిణ్ణి చూస్తూనే పక్కనున్న అతన్ని గూర్చి ఆలోచిస్తున్నాడు రావు. మూర్తి చెయ్యి ఇంకా ఆమె భుజంమీదే ఉంది!" ఈయన మూర్తి గారనీ మా ఆయన'కో'!" రత్నకుమారి అతన్ని పరిచయం చేసింది. "గ్లాడ్ టు మీట్ యూ" లవంటివి అయ్యాక చటుక్కున

అడిగాడు రావు!" అన్నట్టు మీ ఆయన ఊళ్లో లేడా?" అని. రత్నకుమారి మొహంలో రంగులు మారాయి. పట్టనట్టుగా తేల్చేస్తూ. "నీకు తెలీదా? ఆయనకు పెరాలిసిస్ వచ్చిందిలే. హాస్పిటల్లో ఉన్నారు పదిహేనురోజులబట్టీ!" అంది. షాక్ తిన్నట్టు చూశాడు. మోహనరావు. 'భర్త జబ్బుతో పడిఉంటే అతని 'కో' తో సరదాగా షికార్లు తిరగుతూందా ఈమె? అందమైన రత్నకుమారిమీద అతని మనసులో ఏమూలో ఏహ్యతలాటిది పొడచూపింది. "మరి..మరి.. ఆయన దగ్గర ఉండవూ రాత్రిళ్ళు?" ఆగలేక అడిగాడు చికాగ్గా తల ఎగరేసింది రత్నకుమారి "ఏమిటోయ్ నీసోది? జబ్బు మనిషి పక్కన రాత్రంతా కూర్చుని జాగరణ చెయ్యమంటావేమిటి? నావల్లకాదు! అసలు హాస్పిటలన్నా, రోగాలన్నా ఒళ్లుమంట నాకు!" మోహనరావు తెల్లబోయాడు. "ఇంతకీ ఏది సెలక్ట్ చేశావు మూర్తీ? సినిమాకా? పార్కుకా?" పక్కకి తిరిగి మూర్తి నడిగింది రత్నకుమారి. అప్పుడామె భంగిమ మనోహరంగా ఉంది. ముఖం కుడివైపు వాల్చి కళ్లెత్తి ఎడమవైపున్న మూర్తిని చూస్తున్న ఆవిడ కళ్లు ఎంత వెడల్పుగా ఉన్నాయో అని అభినందించలేకపోయింది. రావు మనసు. మూర్తి ఉత్సాహంగా అన్నాడు. "పార్కుకు వెళ్లి సెకెండ్‌షోకి వెడదాం!" "నువ్వూవస్తావా, రావ్?" తను అడగ్గానే సంతోషంగా వస్తాడనుకున్న రత్నకుమారి ఊహ తారుమారయింది. మోహనరావు కళ్లలో ఉత్సాహం మెరవలేదు. నిర్లిప్తంగా అన్నాడు. "అహ్! నాకు ఇంటి దగ్గిర పనుంది!" "ఓహ్! బర్త్‌డేవాడు... అందమైన సంధ్యా సమయంలో ఆలుబిడ్డలతో గడపాలని గాబోలు?" రత్నకుమారి సుందరంగా నవ్వింది. "దారిలో దిగి పోదువుగానిలే రావోయ్!" అంది మళ్లీ తనే. మోహనరావుకు తప్పలేదు. కారులో వెనక సీట్లో కూర్చున్నారు ముగ్గురూ, మధ్యన రత్నకుమారి, ఇటూ అటూ రావూ, మూర్తీ ఆవిడ భుజం అప్పుడప్పుడూ తగులుతూ వుంటే అదోలా అనిపించింది రావుకు. తల తిప్పి ఓరగా చూశాడు. అటువైపు రత్నకుమారి చెయ్యి మూర్తి ఒళ్లో ఉంది. రావుకు ఎబ్బెట్టనిపించింది. మనసంతా వికారంగా అయిపోగా ముళ్లమీద కూర్చున్నట్టు కూర్చున్నాడాకాస్సేపూ. "గుడ్ నైట్" దిగుతున్న రావుకు చెయ్యి ఊపింది రత్నకుమారి. మోహనరావు పేలవంగా నవ్వేసి, "వెరీ గుడ్‌నైట్" అని ఇంట్లోకి నడిచాడు.

ఆ వాతావరణంలోనే కాస్త ప్రశాంతత దొరికినట్లనిపించింది అతడి మనసుకు. 'అందం వెనక ఎంత అగాధం! అందరికన్న ఆత్మీయుడనదగ్గ భర్త పక్షవాతంతో హాస్పిటల్లో పడిఉంటే... ఒకవేళ తనే రత్నకుమారి భర్త అయిఉండి, తనకే పక్షవాతం వచ్చి హాస్పిటల్లో ఉంటే?... ఇలాగే ఇప్పటిలాగే రత్నకుమారి స్నేహితులతో ఏ బెంగా లేకుండా షికార్లు తిరిగేది... ఆ ఊహతో మోహనరావుకు కంపరం కలిగింది. 'కిందటి నెల్లో నాలుగురోజులు గ్రహణి పట్టుకుని నీరసపడిన తను నడుస్తూ ఒకసారి తూలిపోతే బెంబేలుపడి ఏడ్చేసింది సుందరి. తరవాత ఆవిడ పట్టుకోనిదే నడవనివ్వలేదసలు. కాన్పులకు పుట్టింటికి వెళ్ళినప్పుడు "అయిదోనెల్లో వెడుదువుగాని" అన్న తల్లితండ్రులమాట కాదని, "ఆయన కసలే హోటలు తిండి పడదని పరిగెత్తుకు వచ్చేది సుందరి. తనన్నా పిల్లలన్నా ఎంత ఆపేక్ష సుందరికి!' అతని ప్రయత్నం లేకుండానే భార్య మంచితనాన్ని నెమరువేసుకుంటూంది రావు మనసు, దీర్ఘాలోచనలో ఉన్న తండ్రిని కూతురి పిలుపు మేల్కొలిపింది. "నాన్నా అన్నానికి రావాలట! అమ్మ చెప్పమంది!" ఉలిక్కిపడి వాచీ చూసుకున్నాడు రావు. అప్పుడే తొమ్మిది! "మీ భోజనాలయ్యాయా, లలితా?" రావు లేస్తూ అడిగాడు. "ఆ! అమ్మతప్ప!" నవ్వుకున్నాడు

మోహనరావు 'అది వేరే ప్రత్యేకంగా చెప్పేపనేముంది? తను తినకుండా ఎప్పుడు తిన్నదిగనక సుందరి?

"పొద్దుటి పులిహోర ఉందా?" అప్రయత్నంగా అడిగాడు రావు భోజనం చేస్తూ. అప్పుడే సుందరి ముఖం వాడిపోయి ఉండడం చూశాడు. సుందరి త్వరగా పులిహోర తీసుకువచ్చింది. "అలా ఉన్నావేం?" "ఎలా ఉన్నాను?" సుందరి నవ్వింది. "నాన్నా, పొద్దున్న అమ్మ వట్టి మజ్జిగ అన్నం తింది తెలుసా? అదయినా మేమంతా అల్లరి చేస్తే. పిండివంటలు అసలు ముట్టుకోలా.." గుమ్మం దగ్గిర నిలబడ్డ చిన్నకూతురు తుసుక్కున అంది. "ఏం? ఎందుకూ? అవునా?" రావు భార్యకేసి చూశాడు. "నువ్వు తినలేదుగా! అందుకూ...!" "నువ్వు నోరు ముయ్యవే ముందర!" పిల్లదాన్ని గదమాయించింది సుందరి. "శ్యామూ! అమ్మ కంచం పట్రావే ఇలా...!" తినడం మానేసి రావు కూతుర్ని పిలిచాడు. "అదేమిటి?" అని సుందరి తెల్లబోతూంటే అక్కడున్న పదార్థాల్నీ తనే వడ్డించేసి, "ముందు కూర్చో!" అన్నాడు రావు. "మీ భోజనం?..." ఏదో చెప్పబోతున్న సుందరి మాట సగంలో ఆపేస్తూ, "నన్ను లేచి పొమ్మంటావా? కూర్చుని తింటావా?" అన్నాడు, "భలే! భలే! నాన్నా బాగా చేశావు!" గంతులు వేసింది చిన్నపిల్ల. సుందరి మాట్లాడకుండా కంచం ముందు కూర్చుంది. రావు కెందుకో చాలా సంతోషం కలిగిందా సమయంలో.

భోజనం అయ్యాక గదిలోకి వ్చి సిగెరెట్ కాలుస్తూ పచార్లు చేస్తున్న మోహనరావు తమలపాకుల పళ్లెంతో వస్తున్న భార్యను చూసి చిన్నగా నవ్వాడు. "ఆ చీర ఇంకా దాచుకున్నావా? నాలుగేళ్లయింది కదూ కొని?" సుందరి కట్టుకున్న జరీ అంచు డెక్రాన్ చీర చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు. ఆవిడ తలలోని మల్లెల్లా తెల్లగా ఉందా చీర. సుందరి నవ్వింది. "మీకిష్టమైన చీర కదూ? అందుకని జాగ్రత్తగా దాస్తున్నాను..." రావు కళ్లలో సంతోషం మెరిసింది. "పొద్దుటినించి ఏమిటోలా ఉన్నారేం ఈరోజు?" ఉగ్గబట్టుకున్నది కక్కేసింది సుందరి. "ఏంలేదు! తల నెప్పిగా ఉంది పొద్దుటినుండి ఆ విసుగు, అంతే.." "చిన్న అబద్ధం చెప్పేశాడు రావు. కాని సుందరి విని ఊరుకోలేదు. గాభరా పడిపోతూ భర్త నుదురు తడిమిచూసి, "ఉండండి! కాస్త మందు రాస్తాను" అంటూ డబ్బా తీసుకువచ్చి అతను వారిస్తున్నా వినకుండా రాయసాగింది. హాయిగా, అనిపించిందతడికా హస్త స్పర్శ. నుదుటిమీద ప్రేమగా, ఆప్యాయంగా కదులుతున్న ఆమె హస్తాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. పొడుగాటి పలచటి వేళ్లూ, కోలగా కత్తిరించి క్యూటెక్స్ రాసిన గోళ్లూ లేవామె చేతికి.. కానీ, ఎర్రగా పండిన గోరింటాకు మనోజ్ఞంగా కనిపించింది రావు కళ్లకు. "బాగా పండింది కదండీ!" తలెత్తి ఆవిడ ముఖంవైపు చూశాడు. సుందరి కళ్లలో ప్రశాంతమైన ప్రేమజ్యోతి వెలుగుతూంది. తమలపాకుల వల్ల ఎర్రబడిన ఆవిడ పెదవులమీద చిరుహాసం ఉంది ఆ క్షణాన నల్లగా, పొట్టిగా లావుగా ఉన్న చదువురాని పల్లెటూరి మొద్దులా అనిపించలేదు సుందరి అతడికి... నిశ్చల గంభీరమైన ప్రేమవాహినిలా, మాతృత్వం విరిసే మమతామయిగా, భర్తను దైవంగా ఆరాధించి, ప్రేమించే అచ్చమైన భారత స్త్రీగా కనబడింది. ఎర్రటి చందమామను అలంకరించుకున్న ఆమె అరచేతిని తదేకంగా చూస్తూ అలా ఆలోచనలో పడ్డాడు మోహనరావు. 'మట్టిలో బంగారం ఉంది. రాళ్లలోనే రత్నాలు దొరుకుతాయి. కళ్లు తెరిచి చూస్తే రాయికీ

రత్నానికీ తేడా తెలుస్తుంది.' "ఏమిటిలా చూస్తున్నారు? ఏమిటబ్బా గాజులు మరీ అంతలా మెరుస్తున్నాయి? కొత్తవా అనా?" సుందరి మందస్మితంచేస్తూ అడిగింది. "ఊహు?" కళ్లెత్తి చూశాడు రావు. "గాజులండి కొత్తగా చేయించున్నట్టులేవు?" అప్పుడే ఆవిడ గాజులకేసి చూశాడతను. నిజంగానే తళతళా మెరిసి పోతున్నాయి. సాలోచనగా పరికిస్తున్న భర్తను చూసి తిరిగి నవ్వింది సుందరి. "బంగారు గాజులనుకుంటున్నారా ఏమిటి అంతలా మెరుస్తున్నాయని? వీధిలో వస్తే ఎన్నాళ్లుంటాయో చూద్దామని తమాషాకు కొన్నాను!" రావు కళ్లలో ఏదో భావం తళుక్కున మెరిసింది. 'నిజమే! మెరిసేదంతా బంగారు కాదు!' తేలిగ్గా నిట్టూర్చి సుందరివైపు చూసి నవ్వాడు.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

తేది : 31-8-1966